భూమికి సారం.. మనిషికి ఆరోగ్యం..!

- ప్రకృతి వ్యవసాయంతో ఉత్తమ ఫలాలు
- రసాయనిక ఎరువులు, పురుగు మందులకు స్వస్తి
- 19 గ్రామాల్లో రైతుల ముందడుగు

ఒకప్పుడు ఏడు పదుల వయసులోనూ ఆరోగ్యంగా ఉండేవారు. నేడు పాతికేళ్లకే రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరిగాల్సి వస్తోంది. దీనికి కారణం ఏమిటి? అని ఆలోచించే తీరిక కూడా నేటి జనాలకు లేదు. తినే తిండి, తాగేనీరు, పీల్చే గాలి సైతం కలుషితమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యకరమైన జీవితాలు ఎక్కడ దొరుకుతాయి? పూర్వీకులు ఎందుకు అంత ఆరోగ్యంగా ఉన్నారో అన్న విషయాన్ని ఒక్కసారి ఆలోచిస్తే.. నాడు రైతులు పండించిన ఏ పంటలకు పురుగు మందులు, రసాయనిక ఎరువులు ఉపయోగించేవారు కాదన్నది జగమెరిగిన సత్యం.


ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన సజ్జ పంట

తనకల్లు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వ్యవసాయం అంటే రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా చేయడం అసాధ్యమనే పరిస్థితి దాపురించింది. తనకల్లు మండల వ్యాప్తంగా ఏప్రాంతంలో చూసినా దుక్కులు దున్నక ముందే గడ్డి నివారణ కోసం మందులు పిచికారి చేస్తున్నారు. తరువాత రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. విత్తనం వేసింది మొదలు పంట చేతికొచ్చేదాకా లక్షలాది రూపాయల పురుగు మందులు, రసాయన ఎరువులు, డ్రిప్ మందులు, ఉపయోగిస్తున్నారు. దీంతో భూమి తన స్వభావాన్ని కోల్పోతోంది. ఇలా పండించిన ఆహారాన్ని తినడం వల్ల మనుషులు దీర్ఘకాలిక రోగాలకు గురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో.. జనజాగృతి సంస్థ మండలంలోని మల్లిరెడ్డిపల్లి, చీకటిమానుపల్లి, గేమేనాయక్‌తండా, తవళం గ్రామ పంచాయతీల్లో ఎంపిక చేసిన 19 గ్రామాల్లో అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆర్‌డబ్ల్యూఐ (రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్) ప్రాజెక్టు కింద సేంద్రియ వ్యవసాయానికి శ్రీకారం చుట్టింది. గత ఖరీఫ్‌లో సాగుచేసిన వర్షాధార పంట ల్లో పురుగు మందులు, రసాయనిక ఎరువులు ఉపయోగించకుండా ఎంపిక చేసిన రైతులతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించింది. దాదాపు వంద ఎకరాల్లో చిరుధాన్యాలు, నవధాన్యాల సాగును ప్రోత్సహించింది. గ్రామస్థులకు పురుగుమందులు, రసాయనాలు లేని ఆకుకూరలు, కూరగాయలు అందించాలన్న సంకల్పంతో పెరటితోటల పెం పకాన్ని ప్రోత్సహించింది. ఇందులో భాగంగా 250 మంది గ్రామస్థులతో పెరటితోటల పెంపకం చేపట్టింది. ఘన, ద్రవ జీవామృతాలను ఉపయో గించి సాగుచేశారు. ఇందుకు అవసరమైనపరిజ్ఞానాన్ని అందించారు. దీంతో ఈ ప్రాంత రైతులు సహజమైన ఫలసాయాన్ని పొందుతున్నారు.


వంకాయ పంట

కూరగాయలకూ ప్రయోజనమే..



నేను వంకాయ పంట సాగుచేశా. ప్రతివారం పురుగుమందులు కొట్టాల్సి వచ్చేది. జనజాగృతి సంస్థలో పనిచేస్తున్న గరుడప్ప వచ్చి, జీవామృతం, కషాయల గురించి చెబితే నమ్మలేదు. వేలకు వేలు పెట్టి పురుగుమందులు కొట్టలేక జీవామృతం తయారు చేసి పిచికారి చేశాను. దీంతో పంట నల్లగా, నిగనిగలాడడం గమనించాను. ప్రస్తుతం పురుగుమందులు ఆపేసి కషాయాలతో సాగు చేస్తున్నాను.

-కిరణ్‌కుమార్‌రెడ్డి, రైతు, పెద్దపల్లి

జీవామృతం తయారు చేస్తా



తాను స్వయంగా జీవామృతాన్ని తయారు చేసి, రెండు విడతలుగా తాను సాగుచేసిన సజ్జపంటకు పిచికారి చేశాను. తమ గ్రామం వద్ద ఇప్పటికే రైతులు తాము పాటిస్తున్న పద్ధతులను పరిశీలించారు. తాను సాగుచేసిన సజ్జను రైతులు చూసి, ఆనందం వ్యక్తం చేశారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయ వైపు వస్తే మంచింది. జీవామృతం చేసుకోవడం కొంత శ్రమతో కూడుకున్నపని. అందుబాటులోకి తీసుకు వస్తే ఉపయోగించడం సులభమే. -రాధమ్మ, గొల్లపల్లి

రైతుల్లో చైతన్యం తెస్తున్నాం



ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో చైతన్యం తెస్తున్నాం. మూడు దశాబ్దాలుగా జనజాగృతి వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. నడిమికుంటపల్లి, ఎర్రబల్లి గ్రామాల వద్ద నాలుగేళ్ల క్రితం చెన్నై యూనివర్సిటీ సైంటిస్టులు భూమిని పరిశీలించారు. ఇలాగే పురుగుమందులు, రసాయనిక ఎరువులు వాడితే ఈ భూములో మొక్కలు కూడా మొలకెత్తవన్నారు. అప్పటి నుంచి భూమి ఆరోగ్యం కోసం కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఐ ప్రాజెక్టు ద్వారా 19 గ్రామాల్లో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని నియంత్రించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. -గరుడప్ప, జనజాగృతి సంస్థ ప్రతినిధి

పెరటితోటలోనే పదివేల ఆదాయం



నేను విపరీతంగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు ఉపయోగించి పంటలు పండించేవాడిని. టమాటలు పసుపురంగులోకి రావడంతో మార్కెట్‌లో తక్కువ ధరలు పలికేవి. మట్టి పరీక్షలు నిర్వహిస్తే భూమిలో లోపాలున్నట్లు తెలిసింది. దీంతో పురుగుమందులు వాడకూడదని నిర్ణయించుకున్నాను. అదే సమయంలో జనజాగృతి మా గ్రామానికి వచ్చి పురుగుమందులు, రసాయన ఎరువులు లేని వ్యవసాయం గురించి చెప్పింది. పెరటితోటల సాగులో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా అర ఎకరాలో కూరగాయలు, ఆకుకూరలు సాగుచేశాను. మేం తినడమేకాకుండా ఇంటి వద్దే గ్రామస్థులకు తక్కువ ధరకు అమ్మినా రూ.10వేలు ఆదాయం వచ్చింది. ఇదే విధంగా మిగతా పంటలు కూడా సాగు చేయాలనుకుంటున్నా.

- సుధాకర్‌రెడ్డి, కొత్తకురవపల్లి

పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం



ఎలాంటి పెట్టుబడులు లేకుండా మా పశువుల ఎరువులనే వాడుతున్నాం. నేను వర్షాధార పొలంలో సజ్జ పంట సాగుచేశాను. విత్తే సమయంలో జీవామృతంతో విత్తన శుద్ధి చేశాను. తరువాత రెండు విడతలుగా ఆవుపేడ, ఆవు మూత్రం, పుట్టమట్టి, బెల్లం, పప్పుల పిండితో తయారు చేసిన జీవామృతాన్ని ఉపయోగించాను. దీని వల్ల పంట ఏపుగా పెరగడమేకాకుండా, కంకులు కూడా బలంగా వచ్చాయి. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. బోర్లకింద సాగుచేసే పంటలకు కూడా ఈ పద్ధతులే పాటిస్తాను. రైతులందరూ ఈ పద్ధతులు పాటిస్తే భూమితోపాటు తిండికూడా ఆరోగ్యంగా ఉంటుంది.

- శంకర్, రైతు, కొత్తకురవపల్లి

ప్రతి నిరుపేదకు ఇంటి స్థలం ఇవ్వాలి

- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


పుట్టపర్తిలో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలం, నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తిలో పేదలకు ఇళ్లస్థలాలు, టిడ్కో గృహాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు గ్రామీణులకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలాలిస్తామని ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఇళ్ల స్థలాల కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల మంజూరు చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల కోసం చాలా మంది పేదలు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు డిపాజిట్లు చేశారని తెలిపారు. వారందరికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి ఇవ్వాలన్నారు. తమ డిమాండ్లను కూటమి ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలలోపు పరిష్కరించకపోతే చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో సువర్ణను కలిసి ఇళ్ల స్థలాల కోసం ఐదువేల దరఖాస్తులు, వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయాదవ్, జగదీష్, వేమయ్యయాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. ఉండవల్లిలో మంత్రిని సోమవారం ఆమె కలిశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ సిబ్బంది కొరత, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు, కేబుల్ కొరత తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతులతో వారు ప్రవర్తిస్తున్న తీరు సరిగా లేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతకు మునుపు అసెంబ్లీలో బడ్జెట్‌పై మాట్లాడేందుకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వర విచారణ: ఎస్పీ


ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై సత్వరమే విచారణ జరిపి పరిష్కరించాలని ఎస్పీ రత్న సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో 44 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదిదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 246 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులిచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని తెలిపారు. అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తామని పేర్కొన్నారు. మండలాల ప్రత్యేకాధికారులు పీ4 సర్వేను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీవో సువర్ణ, డీఆర్వో విజయసారధి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై సమీక్ష

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో తాగునీటి ఎద్దడి నివారణపై సమీక్షించారు. వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య అధికమయ్యే అవకాశముందని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, సమగ్ర నివేదికలు అందించాలని ఆదేశించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్ ←

ఉష్ణోగ్రతలు


సోమవారం

గరిష్ఠం	36.0
కనిష్ఠం	23.0

214 మంది గైర్హాజరు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కొత్తచెరువు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన ఇంటర్ సెకెండియర్ పరీక్షలకు 214 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. మొత్తం 42 కేంద్రాలలో 9,256 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 9080 మంది రాశారని, 176 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 1141 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1103మంది రాశారని, 38 మంది గైర్హాజరయ్యారన్నారు. మొత్తం మీద పరీక్షలు ప్రశాంతంగా సాగాయన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు 188 మంది డుమ్మా..

జిల్లాలో జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు సోమవారం 188మంది గైర్హాజరైనట్లు జిల్లా పరీక్షా విభాగపు అధికారి లాజర్ తెలిపారు. 1309 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 1121 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.32 మంగళవారం సాయంత్రం	5.13 బుధవారం ఉదయం
కదిరి	6.29 మంగళవారం సాయంత్రం	5.15 బుధవారం ఉదయం
ధర్మవరం	6.32 మంగళవారం సాయంత్రం	5.13 బుధవారం ఉదయం
హిందూపురం	6.32 మంగళవారం సాయంత్రం	5.19 బుధవారం ఉదయం
పెనుకొండ	6.32 మంగళవారం సాయంత్రం	5.19 బుధవారం ఉదయం

సరిపెట్టుకోవాల్సిందే..!

ఈనెల బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ

ధర్మవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌కార్డుదారులకు ఎప్పటిలాగే ఈ నెలలో కూడా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేయనున్నారు. కందిపప్పును మాత్రం అడగొద్దని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై కార్డుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 572289 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటికి 8600 మెట్రిక్‌టన్నుల బియ్యం, 280 మెట్రిక్ టన్నుల పంచదార, 570 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 570 మెట్రిక్ టన్నుల రాగులు నాలుగు నెలల కిందటి వరకూ పంపిణీ చేసేవారు. అయితే గత రెండు నెలలుగా బియ్యం, పంచదార మాత్రమే పూర్తి స్థాయిలో ఇస్తున్నారు. నాలుగు నెలల నుంచి రాగులు, గోధమపిండి ఊసేలేదు. గత వైసీపీ పాలనలో పౌరసరఫరాల వ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నం కావడమే నేటి కష్టాలకు కారణమని కూటమి నాయకులు విమర్శిస్తున్నారు.


కందిపప్పు


రాగులు


జొన్నలు

కందిపప్పుకు అధిక ధర

బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కిలో ధర రూ.115కి పైగా పలుకుతోంది. చౌకధరల దుకాణాల ద్వారా కందిపప్పు పంపిణీ చేయక పోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు బహిరంగ మార్కెట్‌లో కొనడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రేషన్ దుకాణాల్లో కిలో రూ.67లకే అందించేవారు. వచ్చే ఏప్రిల్ నెలలోనైనా కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు.

సరఫరా కాలేదు

ఈ నెల కందిపప్పు, చిరుధాన్యాలు సరఫరా కాలేదు. ఈనెలలో బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తాం. వచ్చే నెలలో ప్రభుత్వం సరఫరా చేస్తే కందిపప్పు, చిరుధాన్యాలు పంపిణీ చేస్తాం. రేషన్ లబ్ధిదారులు సహకరించాలి.

-అశ్వత్థనాయక్, సివిల్ సప్లై డిపో మేనేజర్, శ్రీసత్యసాయి జిల్లా

కర్ణాటక నుంచి డీజిల్..!

- ధర తక్కువ.. లాభం ఎక్కువ
- పెట్రోలు బంకు యజమానుల దిగుమతి
- రోజుకు 10వేల లీటర్ల తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఇంతకాలం కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా ఆంధ్రాలోకి రవాణా చేసేవారు. ఇప్పుడు డీజిల్ కూడా అదే దారిలో వస్తోంది. ఇంతకు ముందు వాహనదారులు సరిహద్దులోని పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోలు పట్టించుకుని వచ్చేవారు. ఇప్పుడు కొందరు పెట్రోలు బంకుల యజమానులే అక్కడి నుంచి ఇక్కడికి యథేచ్ఛగా డీజిల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో అక్రమ రవాణాదారులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హిందూపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఆంధ్రా కంటే డీజిల్ ధర తక్కువ. దీంతో కొంతమంది అక్రమార్కులు కర్ణాటక నుంచి డీజిల్ ఇక్కడికి తీసుకొచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగుతోంది. సరిహద్దుకావడంతో కొంతమంది ఆంధ్రాకు చెందిన పెట్రోల్ బంకుల యజమానులు కర్ణాటక నుంచి డీజిల్ తీసుకొచ్చి దర్జాగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమందికి అటు కర్ణాటకలోనూ ఇటు ఆంధ్రాలోనూ బంకులు ఉండడంతో యథేచ్ఛగా తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిత్యం 7వేల నుంచి 10వేల లీటర్ల దాకా కర్ణాటక నుంచి తీసుకొచ్చి లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కర్ణాటక నుంచి డీజిల్‌ను తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

ధర తక్కువ.. లాభం ఎక్కువ..

ఆంధ్రాలో డీజిల్ లీటరు రూ.99 ఉండగా.. కర్ణాటకలో రూ.90 వరకు ఉంది. అక్కడికి ఇక్కడికి రూ.9 వ్యత్యాసం ఉంది. దీనికారణంగా కొంత మంది పెట్రోల్‌బంక్ నిర్వహించే వ్యక్తులు మధ్యవర్తులతో ఒప్పందాలు చేసుకుని హిందూపురం, పెనుకొండ, పాలసముద్రం ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో పలు పరిశ్రమలు ఉన్నాయి. కర్ణాటక నుంచి డీజిల్ తీసుకొచ్చి ఇక్కడ వాహనాల్లో నింపుకుంటున్నారు. లీటరుపై రూ.9 వ్యత్యాసం ఉండగా ఇక్కడికి వచ్చాక ఆంధ్రాలో ఉన్న ధర కంటే లీటరుపై రూ.2నుంచి రూ.3తక్కువకు విక్రయిస్తున్నారు. దీంతో లీటరుపై కనీసం రూ.6 నుంచి రూ.7 మిగులుతోంది. రోజుకు 7వేల నుంచి 10వేల లీటర్లు తరలిస్తున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.35వేల నుంచి రూ.50వేలదాకా అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ఈలెక్కన నెలకు రూ.12లక్షల నుంచి రూ.15లక్షలదాకా మిగులుతున్నట్లు సమాచారం. ఈలెక్కన అక్రమార్కులు ఏడాదికి ఎంత సొమ్ము చేసుకుంటున్నారో ఇట్టే అర్థం అవుతుంది. పాలసముద్రం, హిందూపురం మండలంలో ఉన్న కొన్ని పరిశ్రమల బస్సులకు కొంతమంది మరికొన్ని పరిశ్రమలకు మరికొంతమంది విక్రయిస్తున్నట్లు తెలిసింది.

చోద్యంచూస్తున్న అధికారులు

ఇటీవల హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులు ఓ వాహనాన్ని తనిఖీ చేశారు. ఇందులో డీజిల్ తరలిస్తున్నట్లు గుర్తించారు. పెట్రోల్ బంకు వద్ద మాదిరిగానే డీజిల్ వేయడానికి పంపుసెట్లను అమర్చుకున్నారు. అనుమానం రాకుండా గూడ్స్ వెహికల్‌లా తయారు చేయించుకున్నారు. నిత్యం హిందూపురం మండలం తూముకుంట వైపు రోజుకు 10వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం. ఒక రాష్ట్రంలోని డీజిల్, పెట్రోల్ వేరే రాష్ట్రానికి తరలించాలంటే పన్ను కట్టాల్సి ఉంటుంది. కర్ణాటక నుంచి ఇంత పెద్దమొత్తంలో డీజిల్ అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల స్థానిక వాణిజ్య పన్నుల శాఖ అధికారులపై పలు ఆరోపణలు వచ్చాయి. గత నెలలో ఉన్నతాధికారుల విచారణ సందర్భంగా.. కర్ణాటక నుంచి డీజిల్ తరలిస్తుండడంతో వాణిజ్య పన్నుల శాఖ ఆదాయానికి గండిపడినట్లు గుర్తించారు. ఈ విషయమై కొందరు పెట్రోలు బంకు యజమానులు పన్నులశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



ఇటీవల పోలీసులు పట్టుకున్న డీజిల్ వాహనం

ఆగండి.. నేనూ వస్తా..!

గుండెపోటుతో భర్త మృతి.. వెంటనే ఉరి వేసుకున్న భార్య

హిందూపురం మండలం కొటిపిలో విషాద ఘటన



దంపతుల మృతితో విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

హిందూపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'ఆయన ఉన్నంతవరకే నేను..! ఆయన చనిపోతే.. గంటలోగా నేనూ చనిపోతా..' అని తరచూ బంధుమిత్రులతో చెప్పుకునే భాగ్యమ్మ(54).. అన్నంతపనీ చేశారు. భర్త తిమ్మారెడ్డి(62) గుండెపోటుతో మృతిచెందడంతో.. బాధ భరించలేక ఆమె ఇంటి వెనుక ఉన్న చింతచెట్టుకు ఉరి వేసుకున్నారు. ఈ విషాద ఘటన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం కొటిపి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వ్యవసాయం చేసుకునే తిమ్మారెడ్డికి గుండె సంబంధిత వ్యాధి ఉన్నింది. దీంతో 15 రోజుల క్రితం వరకూ బెంగళూరులో చికిత్స పొందారు. ఇంటికి తిరిగి వచ్చాక ఎప్పటిలాగే పనులు చేసేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పొలానికి వెళ్లి పశువులకు గడ్డి కోసుకుని ఇంటికి వచ్చారు. కాళ్లు చేతులు కడుక్కుంటూ కుప్పకూలిపోయారు. ఇది చూసిన భార్య భాగ్యమ్మ, కోడలు కేకలు వేయడంతో ఇరుగూపొరుగు వచ్చి సాయం పట్టారు. 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరీక్షించి, తిమ్మారెడ్డి మృతిచెందాడని తెలిపారు. దీంతో బోరున విలపిస్తూ భాగ్యమ్మ ఇంట్లోకి వెళ్లిపోయారు. కాసేపటికి వెళ్లి చూస్తే ఆమె కనిపించలేదు. వెనుక తలుపు తెరిచి ఉండటంతో అటు వెళ్లి చూశారు. అప్పటికే ఆమె చింతచెట్టుకు ఉరి వేసుకుని కనిపించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కిందకు దించేలోగా మృతిచెందారు. దంపతుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, ఆయన చనిపోతే గంటలోగా తానూ చనిపోతానని చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. అన్నతంపని చేస్తుందని ఊహించలేదని కంటతడి పెట్టుకున్నారు. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మునిప్రతాప్ గ్రామాన్ని సందర్శించారు. తిమ్మారెడ్డి కుమారుడు నవీన్ కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో మరో ఆరుగురు..



శివమ్మ(ఫైల్)

● రాయదుర్గం శాంతినగర్‌కు చెందిన నాగళ్లి శివమ్మ(70) అనారోగ్యంతో బాధపడుతుండేవారు. వ్యాధి నయం కాకపోవడంతో సోమవారం తెల్లవారుజామున ఒంటిపై రసాయనం పోసుకుని నిప్పంటించుకున్నారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ జయనాయక్ వెళ్లి పరిశీలించారు. శివమ్మకు నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భర్త ఇదివరకే మృతి చెందాడు. చిన్న కుమారుడు ఉమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన శ్రీనివాసులు(30) ఉరి వేసుకున్నాడు. శ్రీనివాసులు బళ్లారిలోని మోకా వద్ద, కలకుట్టనల్లి వద్ద భార్య కవితతో కలిసి బేల్దారీ పని చేస్తూ జీవనాన్ని సాగించేవాడు. పదిరోజుల కిందట రాయదుర్గానికి వచ్చాడు. ఇంట్లో దుర్వాసన వస్తుండటాన్ని సోమవారం సాయంత్రం గమనించిన స్థానికులు, లోపలికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతున్న మృతదేహం కనిపించింది. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.



త్రివేణి (ఫైల్)

● గుమ్మఘట్ట మండలం గోనబావి గ్రామానికి చెందిన త్రివేణి(17) కడుపునొప్పి తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు తల్లిదండ్రులు వడ్డే శివమ్మ, ఈరన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



అంకిత (ఫైల్)

● కుందుర్పికి చెందిన అంకిత(26) ఉరివేసుకున్నారు. ఆమె కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. భర్త నాగరాజు, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగానే ఇంట్లోనే పైకప్పునకు చీరతో ఉరి వేసుకున్నారు. వారు తిరిగొచ్చేలోగా ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శాంతమ్మ(ఫైల్)

● తనకల్లు మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన శాంతమ్మ(30) ఉరి వేసుకున్నారు. కర్ణాటకలోని రామ్‌పురానికి చెందిన శాంతమ్మకు 15 ఏళ్ల కిందట పెద్దపల్లికి చెందిన వెంకటేష్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్నారులు అదే గ్రామంలోని తమ అవ్వకు ఆదివారం వద్దకు వెళ్లారు. రాత్రి పొద్దు పోయిన తరువాత భర్త బయటకు వెళ్లారు. ఆ తరువాత తలుపు మూసి, గడియ వేసుకుని శాంతమ్మ చీరతో ఉరి వేసుకున్నారు. ఇంతవరకూ ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

● అనంతపురంలోని విద్యారణ్యనగర్‌కు చెందిన అరుణ(44) మానసిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన ఇంట్లోనే ఆదివారం ఆమె విషం తాగారు. సోదరుడు శ్రీనివాసులు ఆలస్యంగా గమనించి, చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్ల స్టాపింగ్ రద్దు

గుంతకల్లు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఈస్ట్ రైల్వే స్టేషన్‌లో 3, 4 లైన్ల పనుల కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్ గుండా వెళ్లే పలు రైళ్లకు ఆ స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాచిగూడ-మైసూరు (12785) ఎక్స్‌ప్రెస్ రైలు, బెంగళూరు-ధర్మవరం (06595), ముంబై-బెంగళూరు (11301), ముంబై-కోయంబత్తూరు (11013), భువనేశ్వర్-బెంగళూరు (18463), దర్భంగ-మైసూరు (12577) అప్ అండ్ డౌన్ రైళ్లకు ఈ నెల 13 నుంచి నిరవధికంగా బెంగళూరు ఈస్ట్ రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు తెలిపారు.

● మక్కాజిపల్లి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ప్రయాణికుల వసతికి సంబంధించిన పనుల కారణంగా ఆ స్టేషన్‌లో గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు ప్యాసింజరు (77213/14) రైళ్ల స్టాపింగ్‌ను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 15 వరకూ మక్కాజిపల్లి స్టేషన్‌లో హిందూపురం ప్యాసింజరును నిలపరని తెలిపారు.

చట్టంతో చెక్..!

టీచర్ల బదిలీకి చట్టం తెస్తున్న కూటమి సర్కారు

- కసరత్తు ముమ్మరం చేసిన విద్యాశాఖ
- ఆన్‌లైన్‌లో సీనియారిటీ జాబితా
- 7 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్రమాలకు చెక్ పడే అవకాశం



సీనియారిటీపై కసరత్తు చేస్తున్న ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో టీచర్ల లెక్క ఇదీ..

సెకెండరీ గ్రేడ్ టీచర్లు	7,307
స్కూల్ అసిస్టెంట్లు	6,849
లాంగ్వేజ్ పండిట్లు	117
ప్రైమరీ హెచ్‌ఎంలు	340
గ్రేడ్-2 హెచ్‌ఎంలు	386
పీఈటీలు	60
మొత్తం టీచర్లు	15,059

అనంతపురం విద్య, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బదిలీల ముందురోజు వరకూ సీనియర్‌గా ఉన్న టీచర్... ఉన్నఫలంగా జూనియర్‌గా మారిపోతాడు. అర్హులైన టీచర్లకు దగ్గరి ప్లేస్‌లు దొరకవు. ఎప్పుడు పడితే అప్పుడు బదిలీల ఉత్తర్వులు. షెడ్యూల్ మేరకు బదిలీలు జరుగుతాయన్న నమ్మకం కూడా ఉండదు. విద్యా సంవత్సరం మధ్యలోనో, ఆఖర్లోనో ఉన్నఫలంగా బదిలీలు చేస్తారు. కోర్టు కేసుల వల్ల ఒక్కో జిల్లాలో ఒక్కోలా ప్రమోషన్లు సాగుతాయి. కొన్ని ఆగిపోతాయి కూడా. ఇవీ ఇప్పటి వరకూ విద్యాశాఖలో టీచర్ల బదిలీలు, ప్రమోషన్లల్లో సాగుతున్న వైపరీత్యాలు. ఇలాంటి వాటికి చెక్ పడనుంది. కూటమి ప్రభుత్వం టీచర్ల బదిలీల కోసం ఏకంగా కొత్త చట్టం తెస్తోంది. ఏపీ రాష్ట్ర టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-2015 అమలులోకి తెచ్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే బదిలీల డ్రాఫ్ట్ విడుదల చేసింది. ఈనెల 7వ తేదీ వరకూ టీచర్ల నుంచి విద్యాశాఖ అభ్యంతరాలు స్వీకరించనుంది. ఈ చట్టానికి ముందు టీచర్ల సీనియారిటీ జాబితాల్లోని లోపాలను విద్యాశాఖ సరిచేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 15,059 మంది టీచర్లు ఉన్నారు. వారి సీనియారిటీ జాబితాను కూడా ప్రకటించారు.

అన్ని డీఎస్సీల లెక్కలు తేలుస్తూ...

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సీనియారిటీ జాబితా ముఖ్యం. గతంలో చాలా మంది టీచర్లు తాత్కాలిక అవసరాల కోసం, బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధి పొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని సైతం అడ్డగోలుగా, ఇష్టారాజ్యంగా నమోదు చేసుకున్నారు. కొందరు తాము అపాయింట్ అయిన డీఎస్సీ, నియామక తేదీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ వివరాలను టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్)లో సైతం తప్పుగా పొందుపరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టీచర్ల సీనియారిటీ జాబితాను పూర్తిగా క్రమబద్ధీకరిస్తోంది. నెల రోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ, ఐటీ సెల్ అధికారులు దీనిపై కరసరత్తు చేస్తున్నారు. డీఎస్సీలు 1982, 1984, 1989, 1994 నుంచి 1988 వరకూ, 2000, 2002 నుంచి 2004 వరకూ, 2006, 2008, 2012, 2014, 2018 టీచర్ల వివరాలు సేకరించి, సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు.

అనేక సమస్యలకు పరిష్కారం

ప్రత్యేక చట్టం తేవడంతో త్వరలో చేపట్టనున్న టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల సమయంలో తలెత్తే అనేక సమస్యలకు చెక్‌పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఏపీ రాష్ట్ర టీచర్ల బదిలీల నియంత్రణ చట్టం-2015 డ్రాఫ్ట్‌ను విడుదల చేశారు. ఈనెల 7 వరకూ టీచర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. అభ్యంతరాల స్వీకరణ, వాటి సవరణ తర్వాత ఈ చట్టం క్షేత్రస్థాయిల్లో అమల్లోకి వస్తే... టీచర్ల చాలా సమస్యలకు తెరపడే అవకాశం ఉంది. జూన్ 1 నుంచి మే 31లోగా విద్యా ఏడాదిగా తీసుకుంటామని ప్రకటించారు. గతంలో విద్యా ఏడాది మధ్యలో, ఎప్పుడు పడితే అప్పుడే బదిలీలు చేసేవారు. ఈ చట్టం చేస్తే.. వేసవి సెలవుల్లోనే నిర్వహించి విద్యా ఏడాదిలో ఎలాంటి డిస్టబెన్స్ లేకుండా చూస్తామని విద్యాశాఖ చెబుతోంది. సీనియారిటీ జాబితాలు గతంలో ఎవరికి తోచినవి వారివి అన్నట్లుగా ఉండేది. ఎప్పుడు బదిలీలు, ప్రమోషన్లు అవసరమైతే... అప్పుడన్నట్లుగా సీనియారిటీ చూపించే వారన్న విమర్శలూ ఉన్నాయి. ఇప్పుడు విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం వల్ల... భవిష్యత్తులో ఎలాంటి సీనియారిటీ జాబితా సమస్య లేకుండా శాశ్వతంగా ఉండే లా దాన్ని సిద్ధం చేస్తున్నారు. దీంతో మెజార్టీ వర్గాలకు న్యాయం చేకూరే అవకాశాలున్నాయి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, బోగస్ దివ్యాంగ సర్టిఫికెట్లు పెట్టి లబ్ధిపొందాలనుకునే వారికి కూడా చెక్ పెట్టేలా చట్టంలో కొత్త నిబంధనలు తీసుకువచ్చేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. రెండేళ్లు, మూడేళ్లకు బదిలీలు చేపట్టేవారు. ఇక పై ఏటా నిర్వహిస్తామంటుండటం శుభపరిణామం. దీనిపై మెజార్టీ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరు మాత్రం లోపాలున్నాయని చెబుతున్నారు. తమ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని, సవరించాలని కోరుతున్నారు.

బోధనేతర పనుల నుంచి మినహాయింపు మంచి నిర్ణయం



లాంగ్ స్టాండింగ్ ప్రధానోపాధ్యాయులకు 4 ఏళ్లు, టీచర్లకు 6 ఏళ్లు నిబంధన పెట్టాలి. సర్వీస్ పాయింట్ ఏడాదికి 1 ఇస్తుండటంతోదానికి సీలింగ్ పెట్టాలి. కేటగిరీ 1లో పనిచేసే టీచర్లకు మళ్లీ అదే కేటగిరీ కాకుండా 2గానీ, 3గానీ కేటాయించాలి. దీర్ఘకాలిక వ్యాధులు, వైకల్యంతో బాధపడే టీచర్లను మాత్రమే ప్రిఫరెన్షియల్ టీచర్లుగా పరిగణించాలి. టీచర్లకు ఎన్నికలు, జనాభా లెక్కలు, విపత్తు సమయాల్లో సహాయక చర్యలు, బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వడం మంచి నిర్ణయం. వీటిని పకడ్బందీగా అమలు చేయాలి.

- జయరాంనాయక్, ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు

శుభ పరిణామం



టీచర్ల బదిలీ కోసం ప్రత్యేకంగా చట్టం తేనుండటం చారిత్రాత్మక శుభపరిణామం. బదిలీలకు విద్యా ఏడాదిని ప్రామాణికంగా తీసుకోవడం చాలా మంచిది. చట్టం పకడ్బందీగా అమలైతే.. సిఫార్సు బదిలీలు ఆగి... సామాన్య టీచర్లకు న్యాయం చేకూరుతుంది. హెచ్‌ఎంలకు 5 ఏళ్లు తప్పనిసరి బదిలీ చేసినపుడు, టీచర్లకు సైతం 8 ఏళ్లు కాకుండా ఐదేళ్లు నిబంధన తేవాలి. పనితీరుకు పాయి ంట్లు పెడితే... దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రతి టీచర్ 1, 2, 3 కేటగిరీల్లో పనిచేసేలా చూస్తే... మెజార్టీ వారికి న్యాయం జరుగుతుందని భావిస్తున్నా.

- ఆదిశేషయ్య, ఎస్ఎల్‌టీఏ, జిల్లా అధ్యక్షుడు

9 నెలల కండీషన్ సవరిస్తే మేలు



విద్యా ఏడాదిని పరిగణనలోకి తీసుకునేటపుడు 9 నెలల సర్వీసు కాకుండా, మొత్తం ఏడాదిని తీసుకోవాలి. 9 నెలల కండీషన్ తొలగించాలి. కేడర్‌తో సంబంధం లేకుండా మొత్తం సర్వీసును తీసుకోవాలి. ఖాళీలను బ్లాక్ చేసే విధానాన్ని సవరించాలి. కేటగిరీ 3, 4ల్లో ఉన్న స్కూళ్లలో బ్లాక్ చేస్తే... దీని వల్ల అలాంటి స్కూళ్లకు టీచర్లు లేకుండా పోయే ప్రమాదం ఉంది. డ్రాఫ్ట్‌లో ఏడాదికి ఒకసారే బదిలీలు అనే అంశంపై స్పష్టత ఇవ్వాలి.

- విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్టీయూ, రాష్ట్ర నాయకుడు

రిటైర్ కాబోయే టీచర్లకు మినహాయింపు



టీచర్ల బదిలీలకు శాశ్వత చట్టం తీసుకొస్తుండటం శుభపరిణామం. దీనిని ఏపీటీఎఫ్ స్వాగతిస్తోంది. టీచర్ల నుంచే నేరుగా అభ్యంతరాలు స్వీరిస్తుండటం ఆనందంగా ఉంది. టీచర్ల ప్రిఫరెన్షియల్ కేటగిరీకి సంబంధించి 80 శాతం, 70 శాతం పైన రెండు స్లాబులుగా ఇవ్వడంపై స్పష్టత ఇవ్వాలి. రిటైర్ కాబోయే టీచర్లకు రెండేళ్ల మినహాయింపు మే 31వ తేదీ కటాఫ్ డేట్ కాకుండా అకడమిక్ ఇయర్‌ను తీసుకోవాలి.

- శ్రీనివాస్‌నాయక్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సెలవుల్లోనే బదిలీలు మంచి నిర్ణయం



ఏపీ టీచర్ల బదిలీల చట్టం-2025ను స్వాగతిస్తున్నాం. వేసవి సెలవుల్లోనే బదిలీలు, ఉద్యోగోన్నతులు పూర్తి చేయడంతో బోధనకు ఇబ్బంది ఉండదు. పైగా ఏటా చేపట్టనుండటంతో టీచర్లకు న్యాయం జరుగుతుంది. సీనియర్ టీచర్లకు గతంలో ఏడాదికి 0.5 పాయింట్లు ఇస్తే... ఇప్పుడు ఒక పాయింట్ ఇస్తామంటున్నారు. ఇది మంచి నిర్ణయం. ఈ క్రమంలో జూనియర్ టీచర్లు నష్టపోకుండా చూడాలి.

- రామాంజనేయులు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నా బిడ్డలెక్కడమ్మా..!



మార్చురీ వద్ద గుమికూడిన మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు

గుండె పగిలిన అమ్మ..!

ముగ్గురు కుమార్తెల మృతితో తల్లడిల్లిన తల్లి గుండె

ఆస్పత్రి మార్చురీ వద్ద కన్నీటి పర్యంతం



ఏడుస్తున్న తల్లి పార్వతమ్మ

కష్టాలన్నీ భరిస్తూ..
బిడ్డలకు సుఖాలు పంచింది..
కన్నీళ్లను దిగమింగుకుంటూ..
వారికి ఆనందభాష్పాలు చూపింది..
నాన్నలేని లోటు కనిపించకుండా..
అన్నీ తానై..
నలుగురు బిడ్డలకు పెద్దదిక్కై..
కంటికి రెప్పలా కాపాడుకుంటోంది..
నిరుపేదరాలైనా..
కుమార్తెకు కాన్పు చేసి..
పురుడు పోసి..
దుస్తులు పెట్టింది..
ఇంటికొచ్చిన ముగ్గురు బిడ్డలను చూసి..
మురిసిపోయింది..
అత్తారింటికి సాగనంపింది..
అందరూ కలిసి మెలిసి వెళ్తుంటే..
సంబరపడిపోయింది..
ఇంతకన్నా.. తల్లిగా ఏం కావాలనుకుంది..
ఇంతలోనే పిడుగులాంటి సమాచారం..
రోడ్డు ప్రమాదం రూపంలో
బిడ్డలను మృత్యువు కబళించింది..
అమ్మ ప్రాణం పోయినట్లయింది..
తల్లి గుండె బద్దలైంది..
కన్నీటిధార ఉబికొచ్చింది..
ఎంత పనిచేశావు దేవుడా.. అంటూ..
గుండెలు బాదుకుంటూ రోదించింది..
'నా బిడ్డలెక్కడమ్మా..' అంటూ
కన్నీరుమున్నీరుగా విలపించింది..

కూడేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కుమార్తెలు మరణించడంతో ఆ తల్లి గుండె తల్లడిల్లింది. గుండెలు బాదుకుంటూ రోదించింది. కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపాన ఆదివారం ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన అక్కాచెల్లెళ్లు యోగేశ్వరమ్మ, నీలావతి, సరస్వతి, ఆమె కుమార్తె మూడు నెలల విద్యశ్రీ మరణించిన విషయం విదితమే. వారి మృతదేహాలకు అనంతపురం సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున మార్చురీ వద్దకు చేరుకున్నారు. ముగ్గురు కుమార్తెలు మరణించడంతో వారి తల్లి పార్వతమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. 'దేవుడా... ఎంతపని చేసినావు' అంటూ ఆ తల్లి.. తన బిడ్డల మృతదేహాలను చూసి రోదించిన తీరు అందరినీ కలచివేసింది. కనిపించిన బంధువులు, కుటుంబ సభ్యులతో కన్నీరు మున్నీరుగా ఏడ్వసాగింది.

గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన బసవరాజు, పార్వతమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు నీలావతి, పుష్పవతి, యోగేశ్వరమ్మ, సరస్వతి సంతానం. బసవరాజు అనారోగ్యంతో ఆరేడేళ్ల క్రితం మరణించాడు. అప్పట్నుంచీ పార్వతమ్మ అన్నీ తానై బిడ్డల బాగోగులు చూస్తేండేది. కుమార్తెలు అందరికీ వివాహాలయ్యాయి. పార్వతమ్మ చిన్న కుమార్తె సరస్వతికి కాన్పు చేయించింది. మనవరాలు విద్యశ్రీ పుట్టింది. ఆ పాపకు మూడు నెలలు. దీంతో సరస్వతికి పురుడు పోసింది పార్వతమ్మ. కార్యక్రమానికి ఆమె కుమార్తెలు నీలావతి, యోగేశ్వరమ్మ కూడా వచ్చారు. అందరూ ఆనందంగా గడిపారు. ఆదివారం సరస్వతి అత్తగారింటికి బయల్దేరింది. ఆమెతోపాటు యోగేశ్వరమ్మ సైతం పుట్టింటికి బయల్దేరింది. ఆమె వెంట రెండేళ్ల కుమార్తె జ్ఞానేశ్వరి కూడా ఉంది. వారిరువురిని వదిలి పెట్టి రావడానికి నీలావతి కూడా బయల్దేరింది. ఆమె వెంట కుమారుడు అచ్యుత్‌ప్రసాద్ ఉన్నాడు. ముగ్గురు కుమార్తెలు, వారి పిల్లలు ఒకే ఆటోలో మర్తాడు నుంచి సరస్వతి అత్తగారి ఊరైన ఉరవకొండ మండలం రాయంపల్లికి బయల్దేరారు. వారందరినీ తల్లి ఆనందంగా సాగనంపింది. కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్న అక్కాచెల్లెళ్లను కారు రూపంలో మృత్యువు కబళించింది. కమ్మూరు వద్ద వారు వెళ్తున్న ఆటోకి ఎదురుగా కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఆటో నుజ్జునుజ్జయింది. సరస్వతి అక్కడికక్కడే మరణించింది. ఆమె మూడు నెలల కుమార్తె విద్య శ్రీ, అక్కలు యోగేశ్వరమ్మ, నీలావతి అనంతపురం ఆస్పత్రిలో మరణించారు. వారి పిల్లలు అచ్యుత్‌కుమార్, జ్ఞానేశ్వరి తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్నారు. ముగ్గురు కుమార్తెలు, మనవరాలు మృతదేహాలను చూసి పార్వతమ్మ గుండెలవిసేలా రోదించింది. బిడ్డలు మరణించడం, వారి ఇద్దరు పిల్లలు ఆస్పత్రి పాలవడంతో ఆ పేదరాలి ఇంట అంతులేని శోకం అలుముకుంది. 'నా బిడ్డలెక్కడమ్మా.. అంటూ' కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆ తల్లి ఆమె ఏడ్పును ఆపడం ఎవరి తరమూ కాలేదు. ఆమె పరిస్థితిని చూసిన వారంతా అయ్యో పాపం.. అంటూ ఆవేదన చెందారు. ఆమెతోపాటు మరో కూతురు పుష్పవతి కూడా బోరున విలపించింది.

నీలావతి, యోగేశ్వరమ్మ, సరస్వతి, విద్యశ్రీ మృతదేహాలకు అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను బంధువులకు అప్పగించారు. వారు ఆయా గ్రామాలకు తరలించారు. కూడేరు సీఐ రాజు, ఉరవకొండ ఎస్ఐ జనార్దన్ నాయుడు అనంతపురం మార్చురీ వద్ద బాధితులతో వివరాలను సేకరించారు.

మంత్రి కేశవ్ దిగ్భ్రాంతి

కూడేరు మండలం కమ్మూరు గ్రామ సమీపంలో ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లతోపాటు మూడు నెలల పసికందు మృతిచెందడంతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను ఎంతో కలచివేసిందని మంత్రి ఆవేదన చెందారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ప్రమాదంలో మరణించిన వారిని ఆయా గ్రామాలకు తరలించేందుకు పయ్యావుల సోదరులు ఏర్పాట్లు చేశారు.

డీఈఓ బ్లాగ్‌లో టీచర్ల సీనియారిటీ లిస్ట్

10లోపు అభ్యంతరాలు చెప్పండి: డీఈఓ

అనంతపురం విద్య, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాలను డీఈఓ బ్లాగ్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జాబితాను టీచర్ల సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా రూపొందించామని, ఆ జాబితాను బ్లాగులో ఉంచినట్లు పేర్కొన్నారు. సీనియారిటీ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. ఈనెల 10వ తేదీలోగా జిల్లా సైన్స్ సెంటర్‌లో అందజేయాలని పేర్కొన్నారు. అభ్యంతరాలు చెప్పే టీచర్లు తమ పేరు, ఐడీ, ఉద్యోగ కేటగిరీ వివరాలతోపాటు, సీనియారిటీలో ఎక్కడ అభ్యంతరం ఉందో స్పష్టంగా, ఆధారాలతో సహా తెలియజేయాలన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

గుంతకల్లు టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీరప్ప సర్కిల్‌లో నివాసముంటున్న వడ్డె మస్తాన్(55)అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. వికలాంగుడైన మస్తాన్ బీరప్ప సర్కిల్‌లో నివాసముంటున్నాడు. కుమారుడు పామిడిలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పింఛన్ డబ్బులు తీసుకుని ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ డిపో పక్కన ఉన్న పెట్రోల్ బంకు వెనుక చెట్ల కింద మద్యం సేవించేందుకు వెళ్లాడు. సోమవారం మస్తాన్ తమ్ముడి కొడుకు 100 నెంబరుకు ఫోన్ చేసి మస్తాన్‌ను హత్య చేశారని ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవు. మద్యం బాటిళ్లు పడి ఉండటాన్ని గుర్తించి అతిగా మద్యం సేవించి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

పుట్టపర్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్రంలోని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా భక్తులు సోమవారం పట్టణ వీధుల్లో నగర సంకీర్తన చేపట్టారు. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తి పాటలు, కోలాటం, చెక్క భజన, కలశాలతో నగరసంకీర్తన నిర్వహించారు. గణేశ్‌గేటు వరకు నగరసంకీర్తన నిర్వహించి అనంతరం సాయికుల్వంతు మందిరానికి వెళ్లి సత్యసాయి సమాధిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో సత్యసాయి రథం


రోడ్డుకు అడ్డంగా వాహనాలు ఉంచిన రైతులు


అడ్డు తొలగించాలని రైతులను కోరుతున్న ఎస్ఐ

అదానీ పవర్‌ను అడ్డుకున్న రైతులు

పరిహారం ఇచ్చి పనులు చేయాలని డిమాండ్ - రైతులతో తహసీల్దార్, ఎస్ఐ, కంపెనీ ప్రతినిధుల చర్చలు

తాడిమర్రి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాడితోట,పెద్దకోట్ల గ్రామాల మధ్య రూ.3వేల కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న అదానీ పవర్ ప్రాజెక్టు పనులను దాడితోట గ్రామ రైతులు సోమవారం అడ్డుకున్నారు. కొండపైకి వెళ్లే వారికి అడ్డుగా ట్రాక్టర్లు ఉంచి అటు వైపుగా ఎలాంటి వాహనాలు వెళ్లకుండా నిరసన తెలిపారు. కొండను తవ్వే క్రమంలో పేలుళ్ల వల్ల దుమ్మురేగి తమ పంటలపై పడుతోందని, దీని వల్ల అరటి, చీనీ పంటలను కొనడానికి ఎవరు ముందుకు రాలేదని పేర్కొన్నారు. పరిహారం ఇస్తే తప్పా తాము కదిలేది లేదంటూ అక్కడే కుర్చున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ క్రిష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, వాహనాలను అడ్డగించడం తప్పని రైతులకు తెలియజేశారు. పరిహారం గురించి స్పష్టమైన హామీ వచ్చేవరకు తాము కదలబోమని రైతులు ఎస్ఐకి స్పష్టం చేశారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి రైతులతో చర్చలకు ఆహ్వానించారు. రైతులు చిన్నసుబ్బారెడ్డి, పెద్దసుబ్బారెడ్డి, రమణారెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు అదాని పవర్ క్యాబిన్‌లో రైతులతో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి కలుగజేసుకుని.. హార్టికల్చర్ అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుతిరిగారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇప్పటికే ముగ్గురు రైతులకు పరిహారం ఇచ్చేందుకు సిద్ధమయ్యామని, వారికి ఇచ్చిన తరువాత నిజంగా నష్టపోయే రైతులకు పరిహారం ఇస్తామని పేర్కొన్నారు.


రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ, అదానీ సంస్థ ప్రతినిధులు

బొప్పాయిలో వైరస్‌కు బంతిపూలతో చెక్


పంటను పరిశీలిస్తున్న డీడీహెచ్

తాడిమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతా వరణ పరిస్థితులలో బొప్పాయి పంటలో అధికం గా వైరస్ వ్యాప్తి చెందుతోందని రాష్ట్ర ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మునిరెడ్డి అన్నారు. మండలంలోని శివంపల్లి, దాడితోట గ్రామాలలో సాగవుతున్న అరటి, బొప్పాయి, మునగపంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ భూసార పరీక్షలు చేసుకుని ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వాడాలన్నారు. అదేవిధంగా రసాయన ఎరువులు వాడ టం వల్ల పీహెచ్ విలువల్లో తేడాలు అధికమై పంటలలో వ్యాధులు కూడా అధికమవుతున్నాయన్నారు. బొప్పాయి పంటలో అంతర పంటగా బంతిపూలు సాగుచేయడం వల్ల సగానికి పైగా వైరస్ తెగుళ్లు నిర్మిలించవచ్చన్నారు. అంతేకాకుండా అదనంగా ఆదాయం కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక వీహెచ్‌ఏ రామాంజనేయులు, రైతులు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందికట్టె వామి దగ్ధం



నంబులపూలకుంట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచెలమ ఎస్సీ కాలనీ రైతు శీనాకు చెందిన ఐదు ట్రాక్టర్ల కాయల కంది కట్టె సోమవారం దగ్ధమైంది. నాలుగు ఎకరాల్లో కంది పంట సాగుచేశానని, పంట పూర్తికాగానే కాయలతో కందికట్టెను కోసి రోడ్డుపై కుప్ప వేశామని శీనా తెలిపారు. నూర్పిడి కోసం సిద్ధం చేసిన కందికట్టెకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైందని వాపోయారు. గ్రామస్థులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. రూ.లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న రమణమ్మ

ఓబుళదేవరచెరువు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో సాయిబాబా గుడి నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన సాతర్ల రమణమ్మ రూ.లక్ష విరాళాన్ని అందించారు. సోమవారం ఆమె ఆ నగదును గ్రామస్థులకు అందచేశారు. దీంతో ఆమెను గ్రామస్థులు శివారెడ్డి, చెన్నారెడ్డి సన్మానించారు.

విద్యాసామగ్రి అందజేత


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

ఓబుళదేవరచెరువు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగేడుకుంట, గౌనిపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోని పదో తరగతి చదువుతున్న 102 మంది విద్యార్థులకు హెల్పింగ్ హ్యాడ్స్ తలాబా రూ. 30 వేల విలువైన విద్యాసామగ్రి అందజేతని అందజేసింది. కార్యక్రమంలో సభ్యులు బాయినెట్ ఆరీఫ్, ఫయాజ్, ముస్తాక్, వసీన్, ఇద్రీస్, ఇస్మాయిల్, ఇమ్రాన్, ఇమామ్‌బాషా పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

పుట్టపర్తిరూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మంగళకర డిగ్రీ కళాశాల, జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలల్లో వ్యాసరచన, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. మహిళా విభాగ డీఎస్పీ ఆదినారాయణ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, ఫోక్సోయాక్ట్, ర్యాగింగ్, సామాజిక మాధ్యమాలు, సైబర్‌నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లాలో ఎస్సీకుంట, తలుపుల, నల్లచెరువు, అమరాపురం, పాఠశాలల్లోనూ వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కమిటీ ఎన్నిక

ధర్మవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవవీధిలో కొత్తగా నిర్మించిన మసీద్-ఏ-ఖాశీం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటి ముతవల్లిగా ఇలియాజ్, వైస్ ముతవల్లిగా అగ్రహారం పకృద్దీన్, సెక్రటరీగా మహబూబ్‌బాషా, జాయింట్ సెక్రటరీగా పకృద్దీన్, సభ్యులుగా ముజీబ్, మహమ్మద్‌జాఫర్, ఇర్షాద్, సిద్దిక్, మైనుద్దీన్, ఖాదర్‌బాషా, ఇర్ఫాన్, మేడాపురం జిలాన్, ఫిరోజ్, అమానుల్లా, బ్యాటరీ జమీర్‌ను ఎంపికచేశారు.

నేడు వైద్యశిబిరం

ధర్మవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక స్పందన ఆస్పత్రిలో మంగళవారం న్యూరాలజీ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు బషీర్, సోనియా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. మెదడు, వెన్నుపాము, నరాలు, మూర్ఛవ్యాధి తదితర వాటికి వైద్యచికిత్సలు అందిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఎడ్లబండ్ల పోటీలు

పుట్టపర్తి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పోతలయ్యస్వామి, చెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. స్థానిక పెద్ద కమ్మవారిపల్లి చింత తోపులో ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించగా 30 బండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. బోనాలతో నగర సంకీర్తనలో పాల్గొన్నారు. సనాతన సాంప్రదాయాలను కొనసాగించేందుకు ప్రతి ఏడాది ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు పెద్దకమ్మవారిపల్లి గ్రామస్థులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి కింద రూ.5వేలు నిర్వాహకులు అందజేశారు. మంగళవారం జ్యోతులు, బోనాలు, గావులు నిర్వహిస్తారు.

ఒంటిపూట బడులు ప్రారంభించాలి

నంబులపూలకుంట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎండలు పెరుగుతున్న దృష్ట్యా వెంటనే ఒంటిపూట బడులు ప్రారంభించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజులు వడగాలులు వీచే ప్రమాదముందని, పిల్లల ఆరోగ్య రీత్యా వెంటనే ఒంటిపూట బడులు ప్రారంభించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

బుక్కపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ సువర్ణ సోమవారం తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు తగిన పరిష్కారం చూపించాలని సిబ్బందిని ఆదేశించారు. వీఆర్‌ఓల పనితీరు మెరుగుపరుచుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, వీఆర్‌ఓలు ఉన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారుల డుమ్మా


నంబులపూలకుంట : గ్రీవెన్స్‌లో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

నంబులపూలకుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుల పరిష్కార దినోత్సవాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మొత్తం 16 మంది అధికారులు హాజరుకావాల్సి ఉండగా.. కేవలం ఎనిమిది మందే హాజరయ్యారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ ఆంజనప్ప, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్లు, వెలుగుసిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. హాజరుకాని అధికారుల జాబితాను జిల్లా అధికారులకు పంపుతామన్నారు.

● **సుంకాల పేరుతో అధిక వసూళ్లు**

ధర్మవరం: మున్సిపాలిటీలో తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసే చిరువ్యాపారులు, రైతుల వద్ద నుంచి కాంట్రాక్టర్లు సుంకాల పేరుతో అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారని, మున్సిపాలిటీ గెజిట్ ప్రకారమే సుంకాలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు విన్నవించారు. అంతేకాకుండా సోమవారం జరిగే వారాంతపు సంత రోజున కూరగాయలు అమ్మేవారి దగ్గర రూ.50 దండుకుంటున్నారన్నారు. ఇందులో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

● **రైతులను ఆదుకోవాలి**

ధర్మవరంరూరల్: హంద్రీనీవా కాలువలను వెడల్పు చేయాలని, చెరువులకు నీటిని సరఫరా చేయాలని, అన్నిపంటలకు గిట్టుబాటు ధర, బీమా సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు తహసీల్దార్ నటరాజ్‌ను విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఇందులో రైతుసంఘం మండల అధ్యక్షుడు మారుతి, నాయకులు ఎస్‌హెచ్ బాషా, పోతలయ్య, శంకరయ్య, చింతలపల్లి నారాయణ స్వామి, బత్తలపల్లి నారాయణ, హరి, వెంకటస్వామి పాల్గొన్నారు.

● **రైతు సమస్యలు పరిష్కరించాలి**

ఓబుళదేవరచెరువు : రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ అనంతాచారికి సీపీఎం, ఏపీ రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సున్నంపల్లి రమణ, రామిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రామక్రిష్ణ, నాగేంద్ర, ఆంజనప్ప పాల్గొన్నారు.

● **జీఎస్టీ రద్దు చేయాలి**

తనకల్లు : బిందు, తుంపర సేద్యం (డ్రిప్, స్పింకర్ల)పై ప్రభుత్వం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఇందులో సీపీఎం నాయకులు రమణ, వెంకటరమణ, శివన్న పాల్గొన్నారు.

● **పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి**

కదిరిఅర్బన్ : అన్నిరకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతిపత్రం అందించారు. పాడి రైతులకు సబ్సిడీతో గ్రాసం అందించాలని, డ్రిప్, స్పింకర్లకు జీఎస్టీ రద్దు చేసి, 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచాలని, వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం సుధాకర్‌రెడ్డి, రఫీ, ఉదయ్, ముస్తాక్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

సాగుభూముల్లో సోలార్ వద్దు


తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు


అనుమతి లేకుండా చేపట్టిన సోలార్ పనులు

నంబులపూలకుంట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకునే వ్యవసాయ భూముల్లో సోలార్ నిర్మాణాలు వద్దంటూ రైతులు తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. మండలంలోని మరికొమ్మెదిన్నె పంచాయతీ పరిధిలో సోలార్ నిర్మాణానికి భూములు సేకరిస్తున్నట్లు తెలుసుకున్న రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తాము భూములను సోలార్‌కు ఇవ్వబోమని స్పష్టం చేశారు. పలువురు మహిళ రైతులు మాట్లాడుతూ.. అనేక తరాల నుంచి భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాని, ఉన్న ఊరిని, భూములను నమ్ముకుని జీవిస్తున్నామని, సాగు చేసుకునే భూములకు నేటికి తమకు డిపట్టాకు నోచుకోలేదని అన్నారు. అలాంటి భూముల్లో సోలార్ ఏర్పాటు చేస్తే తాము జీవనాధారం కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. వీరికి సీపీఎం, రైతు సంఘ నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, రైతు సంఘం నాగిరెడ్డి, మల్లిరెడ్డి, గంగిరెడ్డి, నాగరాజు రైతులు పాల్గొన్నారు.

● **అనుమతులు లేకుండా సోలార్ పనులు**

నంబులపూలకుంట మండలంలోని పెడబల్లి గ్రామంలో రైతు సుధాకర్‌కు చెందిన ఆరు ఎకరాల పొలంలో అనుమతులు లేకుండానే సోలార్ పనులు చేపడుతున్నట్లు ఆ రైతు బంధువు నవీన్‌కుమార్ ఆవేదన చెందారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈప్రాంతంలో శిర్డిసాయి సోలార్ ప్రైవేటు కంపెనీ వారు పనులు చేపడుతున్నారని, ఈ భూమిని విక్రయించాలని సుధాకర్‌ను పలుమార్లు అడిగారని తెలిపారు. అమ్మడానికి ఇష్టం లేదని సుధాకర్ వారికి చెప్పాడరన్నారు. కాగా, పొలం వద్ద ఎవరూ లేకపోవడంతో సుధాకర్ పొలంలో గుంతలు తవ్వి, ప్యానల్స్ ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశారని, సుధాకర్, బంధువులతో కలిసి సోమవారం ఆ ప్యానల్స్ తొలగించామని చెప్పారు. వెంటనే దీనిపై తహసీల్దార్ దేవేంద్ర నాయక్ ఫిర్యాదు చేశామన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి: ఆర్డీఓ

ధర్మవరంరూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రతి లబ్ధిదారుడి ఇంటింటికి వెళ్లి.. రేషన్ సక్రమంగా ఇవ్వాలని ఆర్డీఓ మహేష్ ధర్మవరం పట్టణ, రూరల్ పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ పంపిణీపై ఐవీఆర్ఎస్ కాల్స్‌తో ప్రజల అభిప్రాయాలు తెలియజేస్తారని, కావున రేషన్ డీలర్లు తగు జాగ్రత్తగా రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ నాణ్యత, సమయపాలన, ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ, ఇంటివద్దనే రేషన్, విక్రయవసూళ్లు తదితర అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటారన్నారు. ప్రతి డీలర్ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రేషన్‌ను పంపిణీ చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలను డీలర్లు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నటరాజ, సీఎస్‌డీటీ సురేంద్ర పాల్గొన్నారు.

క్రైం న్యూస్..


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ప్రియుడితో కలిసి భర్త హత్య

నిందితుల అరెస్టు: డీఎస్పీ

పుట్టపర్తిరూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వెంగళమ్మచెరువు గ్రామానికి చెందిన చియ్యేటి నగేష్ (34) ఫిబ్రవరి 28న దారుణహత్యకు గురైన విషయం తెల్సిందే. అతని భార్య సునీతనే తన ప్రియుడు బుడ్డన్నగారి దివాకర్‌తో కలిసి నగేష్‌ను హతమార్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. ఈ మేరకు డీఎస్పీ విజయ్‌కుమార్ సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు. నగేష్, సునీత ఇంటికి ఆదే గ్రామానికి చెందిన దివాకర్ వచ్చిపోతూ ఉండేవాడు. సునీత, దివాకర్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై నగేష్ సునీతను పలుమార్లు మందలించాడు. నగేష్ అడ్డు తొలగించుకోవాలని దివాకర్‌తో కలిసి పథకం వేసింది. గత నెల 28న నగేష్‌ను దివాకర్ తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లి కర్ణాటక నాగేపల్లి సమీపంలోని ఉన్న బ్రాందీషాపులో రెండు బీరుబాటిళ్ళు కొనుగోలు చేశారు. అనంతరం వీరాంజినేయపల్లి గ్రామ సమీపంలోని మామిడితోటలో నగేష్‌కు మద్యం తాగించాడు. మద్యం మత్తులో ఉన్న నగేష్‌ను తనవెంట తెచ్చుకున్న కొడవలితో విచక్షణా రహితంగా గొంతు కోసి హత్యచేశాడు. పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు వెలుగుచూశాయి. మొదటి నిందితుడు దివాకర్‌ను సోమవారం కర్ణాటకనాగేపల్లి కూడలిలో, రెండో నిందితురాలు సునీతను వెంగళమ్మచెరువు ఆమె ఇంటి వద్దనే అరెస్టు చేశారు. హత్యకేసును ఛేదించిన పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్ ఎస్ఐలు కృష్ణమూర్తి లింగన్నకు రివార్డులు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి


భారతి మృతదేహం

ముదిగుబ్బ, మార్చి3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకేపల్లి క్రాస్ సమీపంలో సోమవారం ఆటో అదుపు తపి బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందినట్లు ఏఎస్ఐ నాగభూషణం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు నల్లచెరువు మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భారతి(45) అనంతపురంలో నివసిస్తున్నారు. కదిరిలో ఉన్న కుమార్తెను చూడటానికి సోమవారం అనంతపురం నుంచి బాడుగ ఆటోలో వచ్చారు. అనంతరం తిరిగి అనంతపురం వెళుతుండగా సంకేపల్లి క్రాస్ సమీపంలో ఆటో అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన భారతిని స్థానికులు 108వాహనంలో ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వైసీపీ నాయకుడిపై కేసు

గాండ్లపెంట, మార్చి3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా సోమవారం తెలిపారు. గాండ్లపెంట రెవెన్యూ గ్రామంలో 1080 సర్వే నెంబర్‌లో 4.8 ఎకరాలను రికార్డులు, పట్టా లేకపోయినా, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించు కున్నారని గాండ్లపెంట తహసీల్దార్ బాబు రావు ఫిర్యాదు చేశారన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యపై దాడి...

ధర్మవరం : తన భర్త రమేష్, భర్త అక్క ఓబుళమ్మ తనపై దాడి చేశారని స్థానిక గుట్టకిందపల్లికి చెందిన సునీత టూటౌన్ పోలీసులు సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రమేష్ సునీతపై రమేష్ అనుమానంతో తరచూ వేధింపులకు గురిచేస్తూ కొట్టేవాడు. సోమవారం కూడా రమేష్, ఆయన సోదరి దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో సునీత వారిద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.


ఆలయాన్ని పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

ఆలయాన్ని సందర్శించిన టీటీడీ అధికారులు

ధర్మవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్దయ్యగుట్టలో పునర్నిర్మాణం చేపడుతున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని టీటీడీ అధికారులు మనోజ్, దివాకర్ సోమవారం పరిశీలించారు. వారు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఆలయ విశిష్టత తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఆలయ కమిటీ సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు ధర్మవరానికి వచ్చి ఆ ఆలయ నిర్మాణ పనులు పరిశీలించారు. ఆలయ కమిటీ, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, ఇంకా నిర్మాణానికి రూ.6 కోట్లు కావాల్సి ఉందని ఆలయ కమిటీ సభ్యులు టీటీడీ అధికారులకు వివరించారు. 2026నాటికి ఆలయాన్ని పునర్నిర్మాణం పూర్తి అవుతుందని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

రోడ్డు మధ్యలో గొయ్యి.. ఇబ్బందుల్లో ప్రజలు



కల్వర్టు మధ్యలో ఏర్పడిన గొయ్యి

పెనుకొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రహదారిలో మురుగు కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టుపై పెద్దగొయ్యి ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ కార్మికులు మురుగు కాలువను శుభ్రం చేయడం కోసం ఇటీవల కల్వర్టుపై గొయ్యి ఏర్పాటు చేసి, దానిని పూడ్చకుండా రాళ్లువేసి అలాగే వదిలేశారు. దీనికారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో, గొయ్యిని గమనించకుండా అలాగే వెళ్తే తీవ్ర ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. నగర పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని వెంటనే గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సోమందేపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని జాతీయరహదారిపై హిందూపురం రోడ్డులో వాహనాల తనిఖీచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టం ప్రకారం సవరించిన జరిమానాలు అమలులోకి వచ్చాయన్నారు. నిబంధనలు అతిక్రమించేవారు కొత్తచట్టాలకు అనుగుణంగా ఫైన్ కట్టాల్సి ఉంటుందన్నారు. ఈ క్రమంలో హెల్మెట్‌లేకుండా వెళ్తున్న ద్విచక్రవాహనదారులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని బొలేరో వాహన డ్రైవర్‌కు రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

7 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ

అగళి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అగళి జిల్లాపరిషత్ పాఠశాలలో ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు టెన్నీస్‌బాల్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్-2 నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు గోవిందరాజులు, రవి తెలిపారు. మూడు రోజులపాటు క్రికెట్‌టోర్నీని నిర్వహించనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి గ్రీన్‌భారత్ ఫౌండేషన్ అధ్యక్షులు కోడిపల్లి కామరాజు మొదటి బహుమతిగా రూ.30వేలు, జెడ్పీటీసీ ఉమేష్ రెండో బహుమతిగా రూ.15వేలు, ఎస్ఎల్ఎన్ మూర్తి మూడో బహుమతిగా రూ.10వేలు సొంత డబ్బు అందజేస్తారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ.5లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న లక్ష్మి, నాగరాజు

హిందూపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): లేపాక్షి మండలం కంచిసముద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మి, నాగరాజు రూ.5లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సోమవారం నాగరాజు ఇంటివద్ద ఈ మేరకు సొమ్ము అందజేశారు. ఈ కార్యక్రమంలో కంచిసముద్రం గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధర్నాకు కదిలిన జనం

సోమందేపల్లి, మార్చి3(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాలో పాల్గొనడానికి సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు సోమవారం తరలి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలస్వామి, మహిళా సంఘం జిల్లానాయకురాలు అంజినమ్మ ఆధ్వర్యంలో రెండు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. పట్టణంలో 2సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు నివేశనస్థలం ప్రభుత్వం వెంటనే కేటాయించాలన్నారు.

లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్‌కు సన్మానం



ఆలయ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

హిందూపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్‌ను సోమవారం అధికారులు సన్మానించారు. డీఎస్పీ మహేష్, సీఐలు జనార్దన్, అంజనేయులు, అబ్దుల్ కరీం, ఎస్ఐలు నరేంద్ర, మునీర్‌అహ్మద్‌లు ఆలయ చైర్మన్‌కు శాలువా కప్పి సత్కరించారు. అంతకుముందు లేపాక్షి ఆలయంలో రెవెన్యూ పంచాయతీశాఖ, పోలీసు అధికారులను ఎటువంటి లోటుపాట్లు రాకుండా విధులు నిర్వహించారంటూ చైర్మన్ అభినందించారు.

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు

పెనుకొండ, మార్చి3(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సత్యసాయి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు తెలుగు, హింది. సాంస్కృతం, పరీక్షలకు ప్రభుత్వ కళాశాలలో 326మంది హాజరు కావాల్సి ఉండగా 13మంది గైర్హాజరయ్యారు. సత్యసాయి జూనియర్ కళాశాలలో 100మంది హాజరుకావాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్స్ సుదర్శన్, గంగాధర్‌లు తెలిపారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన

పెనుకొండ, మార్చి3(ఆంధ్రజ్యోతి):నాటుసారా తయారు చేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నవోదయ 2.0గురించి సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాటుసారా నిర్మూలన గురించి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం నాటుసారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు.

కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సృజనబాబు, మడకశిర సీఐ ప్రసాద్‌రావు, ఎస్ఐ రాజశేఖర్, శంకర్, రాముడు, సోమందేపల్లి, రొద్దం, గుడిబండ మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వీఆర్‌ఓలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ వివాదాస్పదం

● ఎండీయూ ఆపరేటర్లు.. డీలర్ల మధ్య విభేదాలు

● ఈకేవైసీ వంకతో 150 మందికి మాత్రమే సరుకులు



తెల్లవారుజామున స్టోర్ వద్ద పడిగాపులు కాస్తున్న జనం

సోమందేపల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆంబోతులు కుమ్ములాడుకుంటే మధ్యలో లేగదూడలు నలిగిపోయినట్టుగా తయారైంది రేషన్ కార్డుదారుల పరిస్థితి. గతప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన ఎండీ యూ ఆపరేటర్లను కొత్తగా వచ్చి స్టోర్ డీలర్లు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన వారికి తాము ఎందుకు సహకరించాలన్న ధోరణితో ప్రస్తుత డీలర్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో సోమందేపల్లి మండలంలో ఎండీయూ ఆపరేటర్ల ద్వారా చేపట్టిన రేషన్‌సరుకుల పంపిణీ వివాదాస్పదంగా మారింది.

కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తరువాత కొత్త డీలర్లను నియమించింది. గత ప్రభుత్వం ఒప్పందం ప్రకారం 2026వరకు ఎండీయూ ఆపరేటర్లు కొనసాగే అవకాశం ఉంది. అయితే తమ ప్రభుత్వం వచ్చాక వారికి మేమెందుకు సహకరిస్తామన్న చందంగా డీలర్ల వ్యవహారం తయారైంది. ఇదిలా ఉండగా ఇటీవల అనర్హుల ఏరివేతలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కైవైసీ వెరిఫికేషన్ ప్రక్రియ కార్డుదారులకు తలనొప్పిగా మారింది. ఈ కేవైసీ గడువును మార్చి 25వరకు పెంచుతూ కేవైసీ చేయించుకునే వెసలుబాటు కల్పించారు. ఈ దిశగా ఎండీయూ ఆపరేటర్లు వెరిఫికేషన్‌లో భాగంగా ఇంటింటికి వెళ్లి రేషన్, ఆధార్‌కార్డు తీసుకుని మార్చి సరుకులు అందజేయాల్సి ఉంటుంది. రేషన్ పంపిణీకి ఈనెల 15వరకు గడువు ఉన్నా డీలర్లు కేవైసీ సాకుగాచూపి రోజుకు 150మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేస్తున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు.



స్టోరు వద్ద పళ్లు తోముకుంటున్న ఓ మహిళ

ఒకరోజుముందుగానే ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు అందించి మరుసటి రోజు షాపువద్దకు రావాలని రేషన్‌కోసం వెళ్లినవారికి డీలర్లు చెప్పడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. తెల్లవారుజామున 3గంటలకే బ్యాగులు చేతబట్టి రేషన్‌షాపులవద్ద క్యూలో నిలబడుతున్నారు. సోమవారం ఉదయం షాపువద్ద బారులు తీరిన లబ్దిదారులకు డీలర్లు ఇలా చెప్పడంతో వారంతా వచ్చి క్యూలో నిలుచున్నట్లు తెలిపారు. మూడు రోజుల్లో పంపిణీ ముగుస్తుందేమోనన్న అనుమానంతో, తరువాత సరుకులు అందుతాయోలేదోన్న భయంతో అనేకమంది షాపులవద్ద సరుకుల కోసం బారులు తీరుతున్నారు.

సోమందేపల్లి మండలంలో 34 రేషన్‌షాపులుండగా పట్టణంలో ఆరున్నాయి. ఎండీయు ఆపరేటర్లు పదిమంది ఉండగా పట్టణంలో ఇద్దరున్నారు. మొత్తం కార్డుదారులు 10,941మందికిగాను 103టన్నుల741క్వింటాళ్ల బియ్యం స్టాక్‌పాయింట్ నుంచి సరఫరా అవుతున్నాయి. అయితే ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం కావడంతో దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. దీనికి తోడు ఎండీయూ ఆపరేటర్లు, డీలర్ల మధ్య సమస్య రాజుకోవడంతో రేషన్ సరుకులు సకాలంలో అందక లబ్ధిదారులు పడిగాపులు పడుతున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈనెల 15 వరకు రేషన్ పంపిణీ

ఈకేవైసీ వెరిఫికేషన్‌కు సంబంధించి రోజుకు 150మంది లబ్దిదారులకు కేవైసీ చేయాలని ఆదేశాలున్నాయి. రోజుకు ఎంతమందికి పంపిణీ చేయాలన్న విషయంలో కనీస నిబంధనలు లేవు. ఈనెల 15వరకు రేషన్ పంపిణీ చేయాలి ఎవరైనా తూకాల్లో మోసాలకు పాల్పడినా లబ్దిదారులను తప్పుదోవ పట్టించినా చర్యలు తప్పవు. కనుక డీలర్లు కార్డుదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి. -సీఎస్‌డీటీ మోహన్

హంద్రీనీవా లైనింగ్‌తో రైతులకు నష్టం

● 40 టీఎంసీలు నీరందించి చెరువులు నింపండి

● ఏఐకేకేఎస్ సదస్సులో రైతు సంఘం రాష్ట్ర నాయకులు

హిందూపురం అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్‌తో రైతులకు ఒరిగేది ఏమి లేదని ఈ ప్రాజెక్టు ద్వారా 40 టీఎంసీలు నీరు చెరువులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కన్వీనర్ వడ్డె శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి శంకర్‌హోష్‌లు పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని కంచి కామాక్షి కళ్యాణమంటపంలో ఏర్పాటు చేసిన అఖిల భారత రైతు, వ్యసాయ కూలీల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చెరువులకు నీరందించాలనే ఆలోచన చేయడం మంచిదే అయినకా కాలువలు పూడిక తీసి వెడల్పు చేసి 40 టీఎంసీలు ప్రతి యేడాది అందించాలని సూచించారు. అంతే కానీ లైనింగ్‌తో రైతులకు ఏ మాత్రం ప్రయోజనం లేదన్నారు. అదే విధంగా ఎంఎస్ స్వామి నాథన్ సిఫార్సు ప్రకారం రైతులకు సి2, 50 ప్రకారం కనీస మద్దతు ధరను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పండించిన పంటలకు రైతులకు గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి వారి పరిస్థితులు నానాటికి దిగజారి పోతున్నాయన్నారు. ప్రభుత్వాలు ధనవంతుల సేవలో నిమగ్నమైనాయన్నారు. రూ. 2 కోట్లు ఖర్చు చేసి బుల్లెట్ రైళ్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటి వల్ల రైతులకు ఏ మాత్రం ఉపయోగం ఉండదన్నారు. ఎవరు ఎన్ని చేసినా ప్రజలు బాగుండాలంటే నాలుగు వేళ్ళు నోటిలోకి వెళ్ళాలంటే ముందుగా రైతులు బాగుండాలన్నారు. అన్నంపెట్టే రైతులకు ప్రోత్సాహం లేదని ఆవేదన చెందారు. మోటర్లకు మీటర్లు బిగిస్తే అధిక ఛార్జీలతో రైతులు నష్టపోతారన్నారు. హంద్రీనీవా పూర్తి చేస్తే 6 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా వెళ్ళి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

రైతు సమస్యలను పరిష్కరించండి

● రైతు సంఘం నాయకుల ఆందోళన

పెనుకొండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరువు కాటకాలతో వాతావరణ పరిస్థితుల ప్రభావం ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానంవల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనరసప్ప, నగేష్, సీఐటీయు కార్యదర్శి బాబావలి, రాజారావు, తిమ్మప్ప, నరసింహ, వలి, గంగాధర్, వెంకటరాముడు తదితరులు వినతిని అందిస్తూ రైతులకు అన్నిపట్టాలకు గిట్టుబాటు ధర బీమా సౌకర్యం కల్పించాలని పట్టు రైతులకు ప్రోత్సాహక బకాయిలు రూ.72కోట్లు విడుదల చేయాలని కోరారు. వ్యవసాయ మోటారుకు ట్రాన్స్‌ఫార్మర్ ధరలు తగ్గించాలన్నారు. విద్యుత్ అదనపు చార్జీలు రైతులపై పడకుండా చూడాలన్నారు. స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయకూడదన్నారు. పాడిరైతులకు పాలపై గిట్టుబాటు ధర పశుగ్రాసం, దాణా, వైద్య సౌకర్యం, ప్రభుత్వమే భరించాలన్నారు. దాణాపై 50శాతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. పండ్లతోటల రైతులకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. హంద్రీనీవాకాలువ వెడల్పుచేసి చెరువులను నీటితోనింపాలని డిమాండ్ చేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

మడకశిరటౌన్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, నియోజకవర్గం అధ్యక్షులు సోమకుమార్ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని, రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, హంద్రీనీవా కాలువ వెడల్పు చేసి అన్ని చెరువులకు సాగు నీరు అందించాలన్నారు. ఎస్ఈజెడ్ పేరుతో రైతుల నుండి సేకరించిన భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసి రైతు కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. రైతులకు పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, పట్టు రైతులకు ఇన్‌సెంటివ్ ఇవ్వాలని, జింకల సమస్యలు పరిష్కరించి రైతులు సాగుచేసిన పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వంద రోజుల నుండి రెండు వందల రోజులకు పెంచి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం అందించి రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆనందరంగారెడ్డి, రామకృష్ణారెడ్డి, మంజునాథ్‌తోపాటు పలువురు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అగళి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు సూపర్‌వైజర్ లీలావతి పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ సూచించారు.

మహిళల రక్షణపై వ్యాసరచన పోటీలు

రొళ్ల: రొళ్ల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ వీరాంజనేయులు మహిళల రక్షణ పట్ల వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



అగళిలో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు

గ్రామాల్లో వీధికుక్కల స్వైరవిహారం

చిలమత్తూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కల సంఖ్యను నియంత్రించాల్సిన శాఖలు పట్టించుకోకపోవడంతో శునకాలు ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. మండలంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీటికి రేబిస్ టీకాలను వేయకపోవడంతో పిచ్చికుక్కలుగా మారుతున్నాయి. వీధి కుక్కలు గొర్రెలు, లేగ దూడలపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఇటీవల పలగలపల్లి గ్రామ ప్రాంతంలో కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి నాలుగు గొర్రెలను తీవ్రంగా గాయపర్చాయి. దాంతో కుక్కలంటే హడల్ అవుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

పెంపుడు కుక్కలకు విధిగా యాంటీ రేబీస్ టీకా వేయించాలి. కుక్క కాటుకు 0-3-7-8 రోజుల్లో నాలుగు సార్లు ఇంజక్షన్ తీసుకోవాలి. వ్యాధి తీవ్రత పెరగకుండా నివారణ టీకాలు వేయించాలి. పిచ్చికుక్కల లాలాజం మనుషుల పైన, పశువులపైన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రేబీస్ సోకిన కుక్కలను ఇంటి ఆవరణంలో కట్టి వేసి పశు వైద్యాధికారులతో చికిత్స చేయించాలి.



వైద్యురాలి నిర్లక్ష్యం.. బాలింత మృతి



మృతిచెందిన ప్రీతి (ఫైల్)

హిందూపురం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. వైద్యురాలి నిర్లక్ష్యంతో ఓ బాలింత మృతి చెందింది. హిందూపురం వాల్మీకి వీధికి చెందిన హరి తన భార్య ప్రీతి(27)ని రెండో కాన్పు కోసం శనివారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యురాలు నీరజ పరిశీలించి బ్లడ్ 9.9 గ్రాములు ఉందని నిర్ధారించుకుని ఇతర పరీక్షలు చేయించారు. అన్నీ సక్రమంగా ఉండటంతో సిజేరియన్ చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డలు పుట్టకుండా ఆపరేషన్ చేయాలని భర్త కోరాడు. దీంతో వైద్యురాలు ఆ ఆపరేషన్ కూడా పూర్తి చేశారు. తరువాత వార్డుకు మార్చారు. గంట తరువాత బాలింత ప్రీతికి రక్తస్రావం మొదలయింది. దీంతోపాటు విపరీతంగా కడుపునొప్పి ప్రారంభమయింది. డ్యూటీలో ఉన్న నర్సులు డాక్టర్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. పలుమార్లు వైద్యురాలికి ఫోన్ చేసినా ఆమె ఆసుపత్రికి రాలేదు. ఫోన్‌లోనే నర్సులకు ఏ పరీక్షలు చేయాలో చెప్పడంతో వాటిని కూడా చేయించారు.

చివరకు డాక్టరు రాత్రి 12 గంటలకు వచ్చి బాధితురాలిని పరిశీలించకుండా అనంతపురం తీసుకెళ్లాలని చెప్పి వెళ్లిపోయిందని భర్త తెలిపాడు. ఆమెను ప్రైవేట్ అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామని, సిజేరియన్ ఎందుకు చేయాల్సి వచ్చిందని అనంతపురం వైద్యులు ప్రశ్నించారన్నారు. హిందూపురంలో డాక్టర్ వేసిన కుట్లు తొలగించి మరోసారి కుట్లు వేయడంతోనే రక్తస్రావం నిలిచిందని భర్త తెలిపాడు. బీపీ అధికం కావడంతో ఆదివారం బాలింత మృతి చెందింది. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తు ఇచ్చే విషయంలో కూడా నిర్లక్ష్యం జరిగిందని ఆసుపత్రి వర్గాల ద్వారా తెలుస్తోంది.

విచారణ చేపడతాం

- లింగన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్

అర్హతలేని మరో వ్యక్తి ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. అదే నిజమైతే లోతుగా విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు విషయం తెలియజేసి చర్యలు చేపడతాం.

బజరంగదళ్ జిల్లా కన్వీనర్‌గా నవీన్

హిందూపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సత్యసాయిజిల్లా బజరంగదళ్ కమిటీని సోమవారం ఎంపిక చేశారు. విశ్వహిందూ పరిషత్ సంస్థాగత నిర్మాణంలో భాగమైన బజరంగదళ్ జిల్లా కన్వీనర్‌గా హిందూపురానికి చెందిన నవీన్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు ప్రాంత కార్యదర్శి కోటేశ్వర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మోటువారిపల్లి చెరువుకు కాలువ నిర్మాణం

పెనుకొండ రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా మోటువారిపల్లి చెరువుకు సొంత నిధులతో కృష్ణాజలాలు అందించేందుకు మంత్రి సవిత పూనుకున్నారు. పెనుకొండ మండలం మారుమూల గ్రామమైన మోటువారిపల్లి చెరువుకు భారీ వర్షాలు కురిస్తే తప్ప ఆ నీరు చెరువుకు వచ్చే పరిస్థితి లేదు. మోటువారిపల్లి చెరువుకింద 300ఎకరాలకుపైగా విస్తీర్ణం ఉంది. ఎండాకాలం వస్తే చెరువులో నీరులేక బోరుబావుల్లో నీరు ఇంకిపోయి తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా హిందూపురం, పెనుకొండ, రొద్దంకు కృష్ణాజలాలు వెళ్తున్న క్రమంలో ముత్యాల చెరువుకు నీరు వదిలారు. దీంతో అదినిండి కురుబవాండ్లపల్లి చెరువు మరువపారుతోంది. అక్కడి నుంచి గొలుసుకట్టు ద్వారా మోటువారుపల్లి చెరువుకు నీరిందించాలన్న ఉద్దేశ్యంతో సొంత ఖర్చుతో 5మీటర్ల లోతు, 12అడుగుల వెడల్పు కాలువ తవ్వకానికి మంత్రి సవిత పనులు చేపడుతున్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా హెంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం



సాగుతున్న బ్రహ్మరథోత్సవం

అమరాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో సోమవారం హెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఉదయమే వివిధ రకాల హోమాలు, అర్చనలు, నిర్వహించినట్లు ప్రధాన అర్చకులు తెలిపారు. ఉదయం కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు వేద పండితుల మధ్య హోమాన్ని నిర్వహించి 3 గంటలకు శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవాన్ని దేవాలయ ప్రాంగణం నుండి కరకట్ట వరకు భక్తుల జన సందోహం మధ్య రథాన్ని లాగారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : కుటుంబల కలహాల కారణంగా మండలంలోని మూడు వేరు వేరు ప్రాంతాలకు చెందిన నంజమ్మ, చంద్రశేఖర్, లక్ష్మీనరసింహులు, క్రిమిసంహారక మందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన రామప్పకు భార్య నంజమ్మ మధ్య నెలకొన్న వివాదం కారణంగా ఆమె విషద్రావకం తాగి అస్వస్థతకు గురయ్యారు. అలాగే గోరంట్లలోని 3 వార్డుకు చెందిన నరసింహులు కుమారుడు చంద్రశేఖర్ భార్య భర్తల కలహాల కారణంగా సూపర్‌వాస్‌మోల్ తాగి అస్వస్థతకు గురయ్యారు. చిలమత్తూరు మండలంలోని సోమగట్టకు చెందిన లక్ష్మీనరసింహులు తన భార్య పుట్టినింటికెళ్లడంతో మనస్థాపానికి గురై క్రిమిసంహారక మందు తాగి ఆస్వస్థతకు గురయ్యారు. ఈ ముగ్గురిని కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలు చేసి, మెరుగైన చికిత్స కోసం హిందూపురం వెళ్లాలని సూచించారు.

లక్ష్మణ్‌దాస్ ఉన్నత పాఠశాల స్థలం అన్యాక్రాంతం

అమరాపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని అమరాపురం నడిబొడ్డున బావాజీ లక్ష్మణ్‌దాస్ ఉన్నత పాఠశాలకు దానంగా ఇచ్చిన 9 ఎకరాల 30 సెంట్ల స్థలం అన్యాక్రాంతానికి గురైందని తహసీల్దార్ కార్యాలయంలో రవిచంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో అధికారులు సర్వే ప్రారంభించారు. అన్యాక్రాంతానికి గురైన భూమిని సర్వేయర్లు గుర్తించినట్లు సమాచారం. ఈవిషయమై బావాజీ లక్ష్మణ్‌దాస్ మనవడు రవిచంద్ర మాట్లాడుతూ ఇది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వారికి సంబంధించిన స్థలమని, ఏ ఇతర ప్రైవేట్ వ్యక్తులు కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకోవడానికి, ప్రైవేట్ వ్యక్తులు వాడుకోవడానికి వీలు లేదని, ఈ అన్యాక్రాంతానికి గురైన భూమిని జడ్పీ బోర్డు వారు ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. ఈ సర్వేలో ప్రధానోపాధ్యాయుడు రఘు, ఎంపీడీఓ రామారావు, మండల సర్వేయర్ పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈగా విశ్వనాథం

గుడిబండ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గుడిబండ విద్యుత్ ఏఈగా జి.విశ్వనాథం సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుడిబండ విద్యుత్ ఏఈ పోస్టు 8 నెలల నుండి ఖాళీగా ఉండేది. అయితే కదిరి డివిజన్‌లో పని చేస్తున్న ఏఈ విశ్వనాథంను ఉన్నతాధికారులు గుడిబండ ఏఈగా బదిలీ చేశారు. దీంతో ఏఈ విశ్వనాథం బాధ్యతలు చేపట్టారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

మహిళతో అనుచిత ప్రవర్తన

స్టోర్ డీలర్‌పై స్టేషన్‌లో ఫిర్యాదు

పెనుకొండ రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరిపాళ్యంలో స్టోర్‌డీలర్ తనపట్ల అనుచితంగా ప్రవర్తించాడని బాధితురాలు కియ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన మంజునాథ్ స్టోర్ డీలర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈకేవైసీ పేరుతో గ్రామంలో ఇంటింటికి తిరుగుతున్నాడు. బాధిత మహిళ ఇంటి వద్దకు వెళ్లి అఘాయిత్యానికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో స్టోర్ డీలర్ పరారయ్యాడు. ఆ మహిళ తన కుమారుడితో కలిసి సోమవారం వస్తుండగా డీలర్ ఎదురుపడి దుర్భాషలాడి, దాడి చేశాడు. బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించామని, విచారిస్తామని ఎస్ఐ తెలిపారు.